# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 27 ఆగష్టు 2024


## వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణోత్సవం

**పీలేరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో పడమర పొలిమేర ధర్మపథం శ్రీకార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ దేవాలయంలో కత్తికానక్షత్రం సందర్భంగా సోమవారం శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీషిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవాట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు అభిరాంస్వామి, శాస్త్రోక్తంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయంలోని కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ భక్తి శ్రద్దలతో బాసింగా దారణ, యజ్ఞోపవితం, మాంగల్యధారణ, తలంబ్రాలు, ఎదుర్కోలు ఉత్సవాలను జరిపించారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాద వితరణ చేశారు. మదనపల్లె జీఆర్టీ జువెలర్సు వారు ఆలయానికి ప్రసాదం బ్యాగులు, కుంకుమ కవర్లు అందజేశారు.

## రత్నం ఇఎం పాఠశాలలో వైభంగా కృష్ణాష్టమి వేడుకలు

**బద్వేలు అర్బన్, ఆగష్టు 26 ప్రభాతవార్త :**



పట్టణంలోని మహబూబ్ నగర్ వీధిలో ఉండే రత్నం ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల నందు శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం పాఠశాల కరస్పాండెంట్ తలారి రత్నం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. చిన్నారులచే పలు రకాల వేషధారణలతో రాధా సమేత శ్రీకృష్ణ వేషధారణలతో పలువురు చిన్నారులు అందరినీ అలరించారు. విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాల గురించి, శ్రీ కృష్ణాష్టమి గోకులాష్టమి రోజున ప్రజలు ఏ విధంగా భక్తి శ్రద్ధలతో భగవంతున్ని పూజించాలనే విషయాలపై వివరించారు. భగవంతుని యెడల భక్తి భావంతో పూజిస్తూ మన జన్మ సార్థకత చేసుకోవాలని, గురువులు, పెద్దల యందు, సమాజం యందు భక్తి భావంతో మెలగాలన్నారు. రాబోవు తరం వారికి మన సాంప్రదాయాలు తెలియజేయాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు పలు రకాల వేషధారణలతో అందరినీ అలరించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు శ్రీ కృష్ణ లీలలు, శ్రీమన్నారాయణ అవతార లీలలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### గువ్వలచెరువు ఘాట్‌లో...

# ఘోర ప్రమాదం

**లారీ కారు ఢీ... 5 మంది అక్కడికక్కడే మృతి ... సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కడప ఎస్పీ**



**రామాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త**

కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులోని నాలుగో మలుపు వద్ద కారు లారీని ఢీకొని వెంకటమ్మ, నాగలక్ష్మి, నాగయ్యతో పాటు ఆరీ డ్రైవరు కార్ డ్రైవరు మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట మండలం కొండివారిపల్లె కుప్పం గ్రామానికి చెందిన చిన్న వెంకటమ్మ భర్త సత్యనారాయణ ఇటీవల చనిపోగా వెంకటమ్మ తన వరుసకు కోడలు ఐన నాగలక్ష్మి తమ్ముడు నాగయ్యతో కలిసి కారు బాడుగకు తీసుకుని కారులో వేంపల్లె, కడప నుండి చక్రాయపేటకు వెళుతుండగా గువ్వలచెరువుకు వస్తుండగా ఎదురుగా రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు వద్దకు రాగానే రాయచోటివైపు నుంచి కడప వైపు వెళ్తున్న అమరరాజా బ్యాటరీకి చెందిన లారీ ఢీకొని డ్రైవర్‌తో సహా మరణించారు. లారీ లోయలో పడి లారీ డ్రైవర్ కూడా మరణించారు. ఐదు మంది అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు లక్కిరెడ్డిపల్లె సిఐ కొండారెడ్డి, రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి, సిబ్బంది, సికెదిన్నె ఎస్ఐ సిఐ మృతులను కారులో నుండి బయటకు లాగారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.









## పాత పెన్షన్ మాత్రమే ఆమోదయోగ్యం



**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ సిస్టం మీద శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సోమవారం ఏపీసిపిఎస్ఈఏ ఆధ్వర్యంలో అవగాహణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఒపిఎస్ మాత్రమే అని, దానికి తప్ప మరే ఇతర పెన్షన్ పథకానికి ఒప్పుకునేది లేదని తెలిపారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధణ రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ అనే మూడు ముక్కలాట మాకు వద్దు ఏపీఎస్ మాత్రమే ముద్దు అని, ఈ యూపిఎస్‌లో కూడ ఉద్యోగి చందాను కొనసాగిస్తున్నారు అంటే ఇది సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది, అదేవిధంగా 10ఏళ్లు ఉద్యోగం చేస్తేనే కనీస పెన్షన్ అంటే 10ఏళ్లకు ముందే చనిపోయే లేదా పదవి విరమణ పొందే వారి పరిస్థితి ఏమిటి, సిపిఎస్‌లోని కార్పస్ ఫండ్ రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగికి చెల్లింపు చేసే విశయం, రిటైర్మెంట్ తర్వాత పెన్షనర్స్‌కు పిఆర్‌సి వర్తింపు, క్వాంటమ్ పెన్షన్, హెల్త్ కార్డుల ద్వారా పెన్షనర్‌కు వైద్యం అందించే అవకాశాలు ఈ ప్రతిపాదిత యుపిఎస్ నందు లేవని కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదని, కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజ్వాన్ అలి మాట్లాడుతూ 2004కు పూర్వం నియామకాలు పొందిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. బాల జోజప్ప మాట్లాడుతూ ఉద్యోగులు కోరేది ఇవ్వకుండా మభ్యపెట్టే ప్రభుత్వాలు మనుగడ సాధించినట్లు చరిత్రలో లేదు అని తెలిపారు. చంద్ర ఓబుళ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఒక పెన్షన్ ఇవ్వడానికి ఇన్ని చట్టాలు అవసరమా అని ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవస్థకు ఇరుసు అయిన ఉద్యోగులకు వృద్ధాప్యంలో పెన్షన్ లేకపోవడం శోచనీయం, ప్రభుత్వం బెట్టు వీడి పాత పెన్షన్ మాత్రమే అమలు చేయాలని కోరారు. ఎక్సైస్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగికి పెన్షన్ న్యాయమైన హక్కు లని దాన్ని హరించి వేసే చట్టాలు ఎన్ని తెచ్చినా ఉద్యోగ సమాజం హర్షించదు అని తెలిపారు. నాయకులు మురళీ మోహన్, నాగరాజు, జమాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, మస్తాన్ వలీ, రోషన్, జమీర్, వారధి, మధు, కురపాటి సుధాకర్, కౌశిక్, పరమేశ్వర, గండికోట బాబా కొండయ్య, బ్రహ్మానందా రెడ్డి, ఫయాజ్, మధుసూధన, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**బద్వేలు అర్బన్, ఆగష్టు 26 ప్రభాతవార్త :**

పట్టణంలోని నెల్లూరు రోడ్‌లోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యందు శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం పాఠశాల యాజమాన్యం కాకా సుబ్రమణ్యం యాదవ్ మరియు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రాచీన సాంప్రదాయాల గురించి, శ్రీ కృష్ణాష్టమి గోకులాష్టమి రోజున ప్రజలు ఏ విధంగా భక్తి శ్రద్ధలతో భగవంతున్ని పూజించాలనే విషయాలపై కళాశాల యాజమాన్యం కాకా సుబ్రమణ్యం వివరించారు. అలాగే దశావతారంలో 8వ అవతారం ఎత్తిన కృష్ణ దేవకిదేవి మరియు వాసుదేవుడల సంతానంగా దుష్టశిక్షణ, శిష్ట రక్షణార్థం అవతారం ఎత్తారన్నారు. మనం కలియుగంలో జన్మించినందున మంచి దైవభక్తి కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భగవంతుని యెడల భక్తి భావంతో పూజిస్తూ మన జన్మ సార్థకత చేసుకోవాలని, గురువులు, పెద్దల యందు, సమాజం యందు భక్తి భావంతో మెలగాలన్నారు. రాబోవు తరం వారికి మన సాంప్రదాయాలు తెలియజేయాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు పలు రకాల వేషధారణలతో అందరినీ అలరించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు హాజరత్, మల్లికార్జున, హరి కుమార్, కరీం బాషా, శ్రీనివాసులు, సునీత, మౌనిక, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడి మోజులో పడి...



- భర్తను హతమార్చిన భార్య...
- మృతదేహాన్ని లోయలోకి తోసి..అదృశ్యం డ్రామా
- లింగంపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

**రాజంపేట అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ఇద్దరు పిల్లల తల్లి ప్రియుని మోజులో పడింది. భర్త డ్యూటీకి వెళుతూనే ప్రియుడితో సరసాలు నేర్చుకుంది. అదే మాయలో పడి చివరకు తప్పని మందలించిన భర్తనే కడ తేర్చింది. సిద్దవటం మండలం లింగంపల్లిలో ఆలస్యంగా వెలుగు తీసిన ఈ దారుణానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధవటం మండలం లింగంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న గాజుల గంగయ్య స్థానికంగానే వున్న లింగంపల్లి వాటర్ స్కీమ్‌లో పనిచేస్తాడు. గంగయ్య ఉద్యోగంలో భాగంగా రాత్రి వేళ కూడ వెళ్లాల్సి వచ్చేది. గంగయ్య భార్య సంధ్యకు ఇదే గ్రామానికి చెందిన బాలరాజుతో ఆటోలో వెళుతూ పరిచయం ఏర్పడింది. ఇది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం గంగయ్యకు తెలిసింది. గత బుధవారం రాత్రి గంగయ్య డ్యూటికి వెళ్లాడు. వెంటనే ప్రియున్ని సంధ్య ఇంటికి రమ్మంది. ఊహించని విధంగా సంధ్య భర్త ఇంటికి వచ్చాడు. సంధ్యాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని సంధ్య సహించలేక పోయింది. అర్ధరాత్రి కావడంతో భర్తపై ప్రియుడితో కలిసి దాడికి దిగింది. ఇద్దరి బలం ముందు గంగయ్య ప్రతిఘటించిన ప్రయోజనం లేకపోయింది. ప్రియుడు, ప్రియురాలు కలిసి గంగయ్యను అంతం చేశారు. మృతదేహాన్ని ప్రియుడి ఆటోలోనే గువ్వర చెరువు ఘాట్‌కు తీసుకుపోయి లోయలో పడేశారు. ఏమి తెలియనట్లు ఇంటికి వచ్చి మరుసటి రోజు చుట్టుప్రక్కల వారితో తన భర్త ఎక్కడికి పోయినాడో రాలేదని నమ్మబలికారు. వెంటనే పోలీసులకు కూడ తన భర్త కనిపించడం లేదని సంధ్య ఫిర్యాదు చేసింది. పోలీసులు రంగంలోకి దిగారు. విచారించారు. సంధ్య, బాలరాజు సంబంధం బయటపడింది. వీరిద్దరూ కలిసి ఉన్నప్పుడు పోలీసులు పట్టుకున్నారు. విచారణలో సరిగా జవాబు చెప్పలేదు. దీంతో ఇద్దరిని వేర్వేరుగా ఒంటిమిట్ట సీఐ నాయక్, సిద్ధవటం ఎస్ఐ చిరంజీవి విచారించారు. విచారణలో కూడ డ్రామా ఆడారు. చివరకు పోలీస్ స్టయిల్‌లో విచారించడంతో హత్య చేసినట్లుగా ఒప్పుకున్నారు. ఇద్దరినీ సంఘటనా స్థలంకు తీసుకువెల్లి పరిశీలించారు. అప్పటికే గంగయ్య మృతదేహం పురుగులు పడి కుళ్లిపోయింది. పోస్టుమార్టం చేసి సిద్ధవటం పోలీసులు విచారిస్తున్నారు. నిందితులను నేడు కోర్టుకు హాజరు పరుస్తారని సమాచారం.

## రాయలసీమ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**బద్వేలు అర్బన్, ఆగష్టు 26 ప్రభాతవార్త :**

పట్టణంలోని రాయలసీమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గొడిసిపాటి అంకయ్య తెలుగు పండిట్ అంబవరం వేణుగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని విద్యార్థుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ ధర్మం, అహింస, నిజాయితీ పిల్లలకు ఎంతో అవసరం అన్నారు. శ్రీ మహా విష్ణువు యొక్క ఎనిమిదవ అవతారమే శ్రీ కృష్ణుడని, వారి జన్మ దినోత్సవాన్నే మనమందరం శ్రీ కృష్ణాష్టమిగా జరుపుకుంటామని తెలియజేశారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దిశా నిర్దేశం చేసిన భగవానుడు శ్రీకృష్ణుడు అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధ్వజస్థంభ మహోత్సవం





**బద్వేల్, ఆగష్టు 26 ,ప్రభాతవవార్త :**

మండల కేంద్రంలోని నాగులచెరువు కట్ట వద్ద గల శ్రీ కాజావారి శ్రీ పర్వత వర్ధినీ దేవి సమేద శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ద్వజ ప్రతిష్ఠా మహోత్సరం సోమవవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో ముందుగా ఉదయం 8.30 గంటల నుండి స్వామి వారికి గంగానయనము, గణపతి పూజ, స్వప్తివాచనము, మాతృకాపూజ, రక్షా బంధనము, ఆచార్యిది బుత్విగ్వరణము, ప్రధాన కలశ స్థాపన. సర్వతోభద్ర మండల, ఏకలింగతో భద్ర మండల కలశ స్థాపన, వాస్తు మండారాధన, ఆదిత్యాది నవగ్రహారాధన, యంత్రములకు అభిషేకము, తదుపరి మంగళహారతి, తీర్థ ప్రసాదాల పంచి పెట్టారు. అలాగే సాయంత్రం 5.30 లకు మృత్సంగ్రహణము, అంకురార్పణము, ప్రధాన దేవతా ఆవాహనము, అగ్ని ప్రతిష్ఠా, దీక్షా హోమము, మూల మంత్ర అనుష్ఠానములు, జలాధివాసము, యంత్రమునకు సహస్రనామార్చన, మంగళహారతి, ఇవ్వడం జరిగింది, వచ్చిన భక్తులకు అన్న ప్రసాధాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమమం కన్నుల పండుగగా జరిగింది. అనంతరం ద్వజ స్థంభ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు మండల నలుమూలల నుండి అధిక సంఖ్యంలో భక్తులు వచ్చి అన్న ప్రసాధాలను తీసుకున్నారు.

## అదుపుతప్పి కారు బోల్తా

### ముగ్గురు మృతి, నలుగురికి గాయాలు

**దువ్వూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారిపై చింతకుంట గ్రామ సమీపంలో సోమవారం కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూలు పట్టణానికి చెందిన 6 మంది పాపపుట్టు వెంట్రుకల కో సం తిరుపతికి వెళుతుండగా చింత కుంట వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సంఘటనలో నాగలక్ష్మి(55), భగత్‌సింగ్ (48)తో పాటు ఏడాదిలోపు చిన్న పాప మృతిచెందింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మెరుగైన వైద్యం కొరకు ప్రొద్దుటూరుకు తీసుకువెళ్లారు. సంఘ టనా స్థలాన్ని ఎస్ఐ వినోద్‌కుమార్ పరిశీలించారు. వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

# ఆరోగ్యమాత ఉత్సవాలకు తరలిరండి


కడప వైద్యవిభాగం, ఆగస్టు 26, ప్రభాతవార్త:



ఆగస్టు 2 నుంచి కడప వేలాంగణి ఆరోగ్యమాత తిరునాళ్ల ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయని రాష్ట్ర నలుమూలల ఉన్న ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్య ప్రధాయిని అయిన కడపలో వెలసిన,తల్లిని దర్శించుకొని పరిపూర్ణమైన ఆరోగ్యం తల్లి దీవెనలు పొందడానికి ప్రతి ఒక్కరూ ఆరోగ్యమాత ఉత్సవాలకు తరలిరావాలని ఆరోగ్యమాత యువత బృందం ప్రేమతో ఆహ్వానిస్తోంది. పాలనాధికారి మోస్ట్ రెవ డా.బిషప్ గాలి బాలి ఆదేశాల మేరకు సోమవారం ఆరోగ్యమాత చర్చ్ నందు ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలు యువత బృందం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినీత్‌రాజ్, విమల్, నవీన్ ప్రేమ్ చరణ్, సహాయ రాజ్, అమృత స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండ దేవస్థానం కమిటీ మెంబరుకు వడ్డెరుల ఘన సన్మానం

కడప వైద్యవిభాగం, ఆగస్టు 26, ప్రభాతవార్త:



కడప నగర శివార్లలో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రమైన పాలకొండ దేవస్థానం కమిటీ మెంబర్ ఓర్సు రమణమ్మకు వడ్డెర సంఘం నాయకులు సోమవారం సాయంత్రం సబ్ జైలు సమీపంలోని శ్రీరామ్ నగర్ రామాలయంలో ఘనంగా సన్మానం చేశారు. టీడీపీ ప్రభుత్వం వడ్డెరులకు సముచిత స్థానం కల్పించినందుకు సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

పులివెందుల రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త ః

పులివెందులలో పేకాట నిర్వహిస్తున్న పలు స్థావరాలపై దాడులు నిర్వహించి 12మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు. నగరిగుట్ట, కదిరిరోడ్డులో దాడులు నిర్వహించి ఏడు మంది పేకాట రాయుళ్లు, రూ.23180నగదు, ఐదు మంది పేకాట రాయుళ్లు, 12730 నగదు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

## ఎందరో అభాగ్యుల జీవితాలలో వెలుగు నింపిన మహోన్నత వ్యక్తి మదర్‌థెరిసా

కడప వైద్యవిభాగం, ఆగస్టు 26, ప్రభాతవార్త:



కలకత్తా మురికి వాడల్లో ఎందరో అభాగ్యుల జీవితాల్లో వెలుగు నింపిన మహోన్నతమైన వ్యక్తి మదర్‌థెరిసా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మదర్ థెరిసా తోటి వారికి సహాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతురాలు అని ఆమె సేవలు కొనియాడారు. కార్యక్రమంలో అబ్దుల్లా, తమీమ్ గౌస్‌పీర్, సుబ్బరాయుడు, బాబ్జీ, రమణమూర్తి పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత సమస్యలపై ప్రభుత్వం చర్చించాలి

- ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

రాయచోటి, ఆగస్టు 26, ప్రభాతవార్త:




ఈనెల 28వ తేదీ జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంట ఉన్న నిరుద్యోగుల సమస్యలపైన వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులపై నూతన కూటమి ప్రభుత్వం చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న విజ్ఞప్తి చేశారు. రాయచోటి పట్టణంలోని పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ పోస్టులు, వార్డు వాలంటీర్ల పోస్టులు తప్ప ఎన్నికల సమయంలో కానిస్టేబుల్, డీఎస్సీ అరకొర పోస్టులు ఎలాంటి ప్రభుత్వ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. అందుకే ఆ పార్టీకి నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పిందని గుర్తు చేశారు. నోటిఫికేషన్లు, ఉద్యోగాలు వసాతయని ఆశతో కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీతో ప్రధానంగా నిరుద్యోగ యువత ఓట్లు వేశారన్నారు. అవునా నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని అదే విధంగా డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని వెంటనే మంత్రివర్గం సమావేశంలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు ఆనంద్, నరేష్, ఖాజావలీ, రామచంద్ర, వెంకటేవ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంతలను పూడ్చిన పోలీసులు



పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త :

పోరుమామిళ్ల పట్టణంలోని మెయిన్ రోడ్డుపైన గల రోడ్డుపైన వేరు వేరు ప్రదేశాలలో ఉన్న గుంతలను పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి మరియు హెడ్ కానిస్టేబుల్ దుర్గ మోహన్ ఆధ్వర్యంలో పలు గుంతలను పూడ్చేశారు. ఆర్‌అండ్‌బి అధికారులు చేయాల్సిన పనిని పోలీసు సిబ్బంది చేయించడంతో పలువురు పాదచారులు, వాహనదారులు హర్షం వ వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌అండ్ బి అధికారులు ఈ రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చిట్వేలి, ఆగస్టు 26, ప్రభాతవార్త:



చిట్వేలి మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, కృష్ణుల వేషధారణతో ప్రతి గ్రామంలో కనువిందు చేశారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా చిల్లవాండ్లపల్లి గ్రామంలో శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపట్టారు. సాయంత్రం రుక్మిణి, సత్యభామల దేవేరులతో స్వామి వారి కల్యాణం కనువిందుగా సాగింది. కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానాలు చేపట్టారు. ఇందులో గ్రామస్థులు, మండల వ్యాప్తంగా పెద్దఎత్తున భక్తులు

# ఘనంగా జన్మాష్టమి వేడుకలు

జమ్మలమడుగు, ఆగస్టు 26, ప్రభాతవార్త:



త్రైత సిద్ధాంత ప్రబోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం జమ్మలమడుగులో శ్రీకృష్ణభగవానుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అర్బన్ సీఐ లింగప్ప, ఏఎస్సై మురళీ యాదవ్, రామకృష్ణారెడ్డి, సీఈఆర్డీఎస్ ఛైర్మన్ పాల్గొనడం జరిగిందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక జమ్మలమడుగు కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు కృష్ణాష్టమి వేడుకల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగరాజు, సాయి, రమణ, నారాయణరెడ్డి, నరసింహా, సందీప్, వెంకటరెడ్డి, చలపతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

జమ్మలమడుగు, ఆగస్టు 26, ప్రభాతవార్త:



శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ముద్దనూరు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పండగ ప్రాముఖ్యతను మరియు చిన్ని కృష్ణుడు చిన్న తనంలో చేసే చిలిపి చేష్టలు గురించి ప్రతి ఇంట్లో వారి తల్లిదండ్రులు తమ పిల్లలకు వివరిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా తన కుమారుడు నిహాల్ రెడ్డిని చిన్ని కృష్ణుని వేషం వేయించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని సూచించారు. ఆయన జన్మాష్టమి విశేషాలు వివరించారు. పిల్లలకు ప్రతి పండగ ప్రాముఖ్యత గురించి తెలియపరచాలన్నారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది భారతదేశం సాంప్రదాయాలను కొనసాగించేలాచేయాలని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో సయ్యద్ షా సాహెబ్ జానీ ఖాద్రి స్వామి గంధోత్సవం

జమ్మలమడుగు, ఆగస్టు 26, ప్రభాతవార్త:



పట్టణంలోని మెయిన్ బజార్ గల జామియా మసీదు స్వర్గీయ పీఠాధిపతి అల్ హజ్ సయ్యద్ షా సాహెబ్ జానీ ఖాద్రి స్వామి గంధోత్సవం సోమవారం సాయంత్రం జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ బాషా ఖాద్రి, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటగా పీఠాధిపతి సాదిక్ పాషాఖాద్రి గురువులు, భకక్తులతో కలిసి స్వర్గీయ పీఠాధిపతి మజార్ వద్దకు పకీర్ల మేళతాళాలతో కలిసి వెళ్లారు. అంనతరం స్వామి వవారి పవిత్ర మజార్లకు ఖరీదైన పూల గిలాపులతో అత్తరుతో అలంకరించారు. స్వామి వారికి గంధోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులందరికీ జామియా మసీదులో అన్నదానం ఏర్పాటు చేశారు. పీఠాధిపతి కుటుంబీకులు, గురువులు, భకక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే హుందాగా వ్యవహరించాలి

- మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:




చెత్త పన్నులపై ఎమ్మెల్యే మాధవిరెడ్డి అనవసర రాద్ధాంతం చేస్తోందని టీడీపీ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విషయాలు తెలుసుకొని హుందాగా వ్యవహరించాలని కడప మేయర్ కె.సురేష్‌బాబు అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా కడప కార్పొరేషన్‌కు రావాల్సిన రూ.5.6 కోట్లు ఇవ్వలేదని దీనిపై ప్రభుత్వానికి నోటీసులు పంపినా ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. సోమవారం కడప నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కడప కార్పొరేషన్‌కు రూ.75 కోట్లు రాబడి వచ్చినా సుమారు రూ.72 కోట్లు ఖర్చు అవుతోందని వెల్లడించారు. చెత్త పన్నుపై కడప ఎమ్మెల్యే ఇష్టమొచ్చిన రీతిగా మాట్లాడడం సరికాదన్నారు. కేవలం ప్రభుత్వం నోటి మాటతో చెత్త పన్ను వసూలు చేయొద్దని చెప్పారు. ఇంత వరకు ఎటువంటి అధికారిక జీవో ఇవ్వలేదని తెలిపారు. చెత్త ద్వారా వచ్చే రాబడి కేవలం రూ.25లక్షలు మాత్రమే అని తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఉన్న 90 ఉన్న వెహికల్‌లో 20 తమకు తాముగా వెళ్లిపోయారు. చెత్తను సేకరించే సిబ్బందికి జీతం ఎవరు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా.. లేక నగరపాలక సంస్థ ఇవ్వాలా అనేది ఇంత వరకు చెప్పలేదని విమర్శించారు. రూ.2.50 కోట్లు నెలకు చెత్త ఎత్తే వాహనాలు, సిబ్బందికి ఖర్చు అవుతోందన్నారు. మురికి వాడల్లో రూ.30, గృహాలకు రూ.40, కమర్షియల్ దుకాణాలకు రూ.90 చెత్త సేకరణకు వసూలు చేయాలని తీర్మానం చేశాం. వంద చెత్త వాహనాల ద్వారా 200 మంది సిబ్బందితో చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తేస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే హుందాతనంగా వ్యవహరించాలని నోటికి వచ్చినట్లు మాట్లాడడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లి, సూర్యనారాయణ, బాబు, షంషీర్, రామలక్ష్మారెడ్డి, కిరణ్, చాక్లెట్, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఈనెల 29న కలమల్ల గ్రామానికి మాజీ ఉప రాష్ట్రపతి రాక

జమ్మలమడుగు, ఆగస్టు 26, ప్రభాతవార్త:

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తొలి తెలుగు శిలాశాసనం కలిగిన ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు జమ్మలమడుడు ఎన్‌డీఏ కూటమి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గం ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు ఎన్‌డీఏ కూటమి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, కడప కలెక్టర్, జేసీ తదితరులు హాజరువుతారన్నారు.

## పిచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు



**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్ధేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరోటినాయిడ్స్, జిక్సాంథౌథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్.

# గ్రామాల్లో చిరుధాన్య విప్లవం



**చేయి చేయి కలిపితే చేతకానిది ఏముంటుంది? వీళ్లదీ అదేమాట. ఐదువేలమంది మహిళలు కాయగూరలు పండించి నగరాలకు ఎగుమతి చేశారు. ఫర్నిచర్ తయారుచేసి పట్టణాలకు పంపించారు. తాజాగా చిరుధాన్యాలని సామాన్యులకు చేరవచేస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు.** జనగామ జిల్లాలోని కాకతీయ మహిళా సహకార సంఘం ఏం చేసినా అది తోటివారికి స్ఫూర్తినిస్తూనే ఉంది.

కొవిడ్ తరవాత స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలోని పల్లెల్లో ఒక కార్పొరేట్ సంస్థ సర్వే నిర్వహించింది, ఆశ్చర్యంగా ఒక్క తాటికొండ గ్రామంలోనే 600 బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఈ విషయం తెలుసుకున్న కాకతీయ మహిళా సహకార సంఘం సభ్యులు.. అనారోగ్యం నుంచి కోలుకోవడానికి చికిత్సతో పాటు చిరుధాన్యాలతో స్వీట్లతో సహా అన్ని రకాల వంటలూ చేసు కోవచ్చని ముందుగా తమ సంఘ సభ్యులకే అవగాహన కల్పించారు. ఆ తరవాత నుంచీ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటిచోట్ల సేంద్రియ పద్ధతుల్లో పండించిన జొన్నలు, రాగులు, సజ్జలను నెలకోసారి లారీల్లో ఘన్‌పూర్ తెప్పించుకుంటున్నారు. సొంతంగా గిర్నీలు, మరమిల్లులు ఏర్పాటు చేసుకుని చిరుధాన్యాలని మర పట్టిస్తున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి బయటకన్నా పది రూపాయలు తక్కువకే పిండి, రవ్వ అమ్ముతు న్నారు. ప్రస్తుతం వీరు 75 గ్రామాల్లో ప్రతి నెలా జొన్న, రాగి, సజ్జ పండి, రవ్వలతోపాటు గోధుమలను విక్రయిస్తూ అరోగ్యానికి పట్టం కడుతున్నారు. ఇంతకీ వీళ్ల ప్రయాణం ఎలా ప్రారంభమైందంటే 22 ఏళ్ల నక్రితం గ్రామీణ మహళల శక్తిని ప్రపంచానికి చాటేందు వెంకటస్వామి స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో 12 మంది సభ్యులతో కాకతీయ మహిళా మాక్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. వీరంతా నెలకు రూ.పది నుంచి రూ.50 వరకు పొదుపు చేస్తూ ఆర్థికంగా బలపడ్డారు. క్రమంగా వీళ్ల పొదుపు కోట్ల రూపాయలకు చేరుకుంది. అలా అలా ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందుతూ 75 ఊళ్లలో 5200 మంది సభ్యులు ఈ సంఘంలో చేరారు. పొదుపు సొమ్ముతో మొదట వీళ్లు ఒక సూపర్ మార్కెట్ ప్రారంభించారు. ఆ తరవాత వ్యాపారంలో చురుకుగా ఉండేందుకు కంప్యూటర్ శిక్షణ తీసుకున్నారు., 2018లో సేంద్రియ కూరగాయలు పండించి హైదరాబాద్‌కు మొత్తంలో ఎగుమతి చేసేవారు. సంఘంలోని ఒంటరి మహిళలువడ్రంగం పనిలో శిక్షణ తీసుకున్నారు.గుమ్మాలు, కిటికీలు, డైనింగ్ టేబుళ్లు కంప్యూటర్ టేబుల్ చేసి ఉపాధి పొందుతున్నారు. అలా అంచెలంచెలుగాఎదుగు తున్న ఈ సంఘం ప్రస్తుతం చిరుధాన్యాల ఉత్పత్తులతోనూ దూసుకెళ్లోంది.

**నెల తిరిగేసరికి ఇంటి అద్దె కట్టడానికి నాన్న పడుతునన కష్టాన్నీ.. ఇద్దరమ్మాయిలే ఎలా నెట్టుకోస్తామో ఈ జీవితాన్ని అని అమ్మ పడుతున్న ఆవేదనను కళ్లారా చూసింది. కోచింగ్ ఊసే లేకుండా నాలుగేళ్లపాటు రోజుకో గంట సాధన చేసి కోడింగ్‌పై పట్టు పెంచుకుంది. పే-పాల్ కంపెనీలో రూ.34 లక్షలకుపైగా వార్షిక వేతనానికి ఎంపికయింది. కన్నవాళ్ల కలల్నీ, ఇబ్బందుల్నీ తీర్చాలను కుంటోంది. ఆమే హుజూరాబాద్‌కి చెందిన యాల్ల కృష్ణవేణి.**



# రోజుకో గంట చదివి లక్షల జీతం ..


పేదింటి ఆడబ్డిని.. అమ్మానాన్నల కష్టాలు చూస్తూ పెరిగా. ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి ఎలాగైనా మంచి ప్యాకేజీతో ఉద్యోగం అందుకోవాలననది నా లక్ష్యం. దాన్ని సాధించగలిగా, అయితే, ఈ విజయం అంత సులవుగా మాత్రం రాలు. మాది హనుమకొండ జిల్లా పెంచికల్‌పేట. నాకు ఊహ తెలిసేనాటికే అమ్మానాన్నలు ఉపాధి కోసం హుజూరాబాద్‌కు వచ్చేశారు. నాన్న సదిరెడ్డి ప్రైవేటు చిట్‌ఫండ్‌లో ఉద్యోగి. అమ్మ అంజలి గృహిణి. చెల్లె హరిప్రియ మెడిసిన్ చదువుతోంది. అమ్మానాన్నలు మాకోసం ఎంతో కష్టపడుతున్నారని చిన్నప్పుడే అర్థమైంది. ఆ ఇబ్బందుల నుంచి గట్టెక్కాలంటే చదువు తప్ప మరో దారి లేదని భావించా. అందుకే, ఏ తరగతైనా నేనే ఫస్ట్ బిటెక్ హనుమకొండ సమీపంలోని ఎస్సార్ కళాశాలలో సిఎస్ఇలో ఏరాను.

**ఆ భయం వెంటాడటంతో....** ఓ పక్క ఇంజినీరింగ్ పూర్తయినా ఉద్యోగాలు దొరక్క ఇబ్బందిపడుతోన్న సీనియర్ల పరిస్థితి ఆందోళన కలిగిస్తే, మరో పక్క ఇంటి అద్దె చెల్లించలేని నాన్న స్థితి కలవరపెట్టింది. దీంతో అందరికంటే భిన్నంగా చదివితేగానీ అనుకున్న లక్ష్యం చేరుకోలేనని అర్థమైంది. అందుకే, చదువుతో పాటు ఇతర నైపుణ్యాలపైనా పట్టు తెచ్చుకోవాలనుకున్నా. ఇందుకోసం రోజూ ఒక గంటపాటు కోడింగ్‌పై పట్టు పెంచుకోవడం ఆరంభించా. మద్యమద్యలో సినిమాలు, రీల్స్.. వంటి వాటి గురించి స్నేహితులు చెప్పినా.. నాకు మాత్రం నా లక్ష్యమే గుర్తొచ్చేది. అవి చూసేత కాసేపు ఆనందంగా అనిపించొచ్చు కానీ, నేను ఎంచుకున్న పంథాలో విజేతగా నిలిస్తే ఎప్పటికీ సంతోషమే నా వెంట ఉంటుందని నాకు నేను సర్దిచెప్పుకొనేదాన్ని.

**ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా...** ఇలా బిటెక్ మొదటి ఏడాది నుంచి ఫైనల్ ఇయర్ వరకు రోజూ కచ్చితంగా ఫోన్ ల్యాప్‌టాప్‌లను కేవలం కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణానయల్ని నేర్చుకునేందుకే వాడా. తాజాగా వచ్చిన చాట్‌జీపీటీలో ప్రతిభ చూపించి మూడునెలల పెయిడ్ ఇంటర్న్‌షిప్ అవకాశం దక్కించుకున్నా. తరవాత జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పే-పాల్ కంపెనీలో రూ.34.40 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యా. అంటే నెలకు సగటున 2,86 లక్షల జీతాన్ని ఒదుకోబోతున్నా. నాన్న ఇప్పటికీ రూ.15 వేల కోసం పడుతున్న కష్టం చూసి.. నా శ్రమ ఫలించిందనే సంతోషం ఇప్పుడు మనస్ఫూర్తిగా కలుగుతుంది. ఎవరికైనా నేనొకటే చెబుతా.. ఎంత కష్టమైనా ఇష్టమైన దాని కోసం కష్టపడితే కచ్చితంగా విజయం సాధించగలమనడానికి నేనే ఓ

# ఎలాంటి పుస్తకం కొంటున్నారు?

**కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకు కానుకగా పుస్తకాలు ఇస్తారు. వారిలో ఒకరు బాబు పుస్తకంపై ఆసక్తి చూపించడు. మరొకరు అమ్మాయి పుస్తకంపై నిరాసక్తతగా చూపుతుంది. ఎందుకంటే అవి వాళ్లకి పెద్దగా నచ్చవు. అందుకే పిల్లల పుస్తకాల ఎంపికలో ఈ విషయాలు గుర్తు పెట్టుకోవాలి.**



ముందుగా వయసు, పట్టి స్థాయిని పరిగణనలోకి తీసుకోవాలి. ఊహాశక్తిని పెంచేలా, వాళ్ల మనసును దోచేలా పుస్తకం ఉండాలి.

ముఖ్యంగా వారి అభిరుచి కనిపెట్టాలి. పసిపిల్లలు పదాలు లేకుండా కేవలం బొమ్మలతో ఆకర్షణీయంగా ఉండే పుస్తకాలపైనే ఆసక్తి చూపిస్తారు. ఇక, అయిదారేళ్ల పిల్లలైతే సాధారణంగా వారికి తెలిసిన, రోజూ వాడే పదాలుంటే ఇష్టపడతారు. వారికి తెలిసిన బొమ్మలతో కథ చెప్పినట్లుంటే వాటిపై మక్కువ చూపిస్తారు. 8-9 ఏళ్ల వయసువారికి చిన్న కథల సంపుటి లేదా వాస్తవిక ప్రపంచాన్ని చూపించే కథ ఉండాలి. ఫాంటసీ, సాహసం, స్నేహంవంటి టాపిక్స్‌ను వీళ్లు ఇష్టపడతారు. పదేళ్లు దాటినవారు మెదడుకు పదను పెట్టేవాటిపై ఆసక్తి చూపిస్తారు. దీన్ని పిక్చర్ వాక్ అంటారు. బొమ్మలని చూసి గీసేవీ, వాటిని చూసి కథ చెప్పేలాంటివి వాళ్లకి ఆసక్తిని కలిగిస్తాయి.

**ఏం చేయాలంటే...** ఇంట్లో పిల్లల అభిరుచులతోపాటు మిగతా పిల్లలు వేటిని ఎంచుకుంటున్నారో కూడా తెలుసుకోవాలి. దీని కోసం సమీక్షలు చదవడం, స్నేహితులు, టీచర్స్‌తో మాట్లాడటం మంచిది. అలాగే లైబ్రేరియన్ల వద్ద కూడా ఏ తరగతి పిల్లలు ఎటువంటి పుస్తకాలను ఆసక్తిగా చదువుతున్నారో అడగొచ్చు. వారి వద్ద సలహాలూ పొందొచ్చు. ప్రస్తుతం పిల్లలు అనుసరిస్తున్న సోషల్‌మీడియా ప్రపంచంలోనూ వారికిష్టమైన అంశాలను గ్రహించొచ్చు. పుస్తకలు ర్యాకులు ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ ఎక్కువగా సేల్ అయ్యేవాటి గురించి తెలుసుకోవచ్చు.

# ముఖ్యమంత్రి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

**పీలేరు,ఆగస్టు 26 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబునాయుడు గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ ఎమ్మెల్సీ యేసురత్నంకు లేదని వడ్డెర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవర్ల మురళి అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఆర్‌ఈఅండ్ బి గెస్టు హైస్‌లో మాట్లాడుతూ 2014 నుంచి2019 వరకు తెదేపా హయాంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి 132 కోట్లు నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. చేతివత్తుల వారికి చేయూతనిస్తూ ఆదరణ పథకం ద్వారా పనిముట్లు యంత్రాలు కొనుగోలు చేయించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సత్య పాల్ కమిటీ వేసిన ఘనత అప్పటి సీఎం నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కార్పోరేషన్లను అలంకార ప్రాయం చేసిందని పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. ఆదరణ పథకం ఎత్తేసిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏనాడైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడిగారంటూ ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వడ్డెరల అభ్యున్నతికి కట్టుబడి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. వడ్డెరలకు నామినేటెడ్ పోస్టులు ఇచ్చి రాజకీయ అభివద్ధి చెందే విధంగా తోడ్పాటు అందిస్తుందని ఆయన అన్నారు. రమాదేవి, చంద్రమ్మ, బాబు, శ్రీనాథ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# విశ్వమాత మధర్ థెరీసా జయంతి

**పీలేరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో విశ్వమాత మధర్‌థెరీసా జయంతిని జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉర్దూ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ క్రైస్తవ సన్యాసిగా 1931 మే 24న భారత దేశంలో అడుగు పెట్టిన మధర్ కోల్‌కత్తా లోని సెయింట్‌మేరీ పాఠశాలలో పనిచేస్తుండగా మురికివాడల్లో కటిక పేదరికంతో ఉన్నవారిని చూసి మధర్ చలించిపోయారని దిమిషనరీ ఆఫ్ చారిటీ సంస్థను స్థాపించి ఎవరి ఆదరణకు నోచుకోని రోగులు అనాథల్ని అక్కున చేర్చుకోవాలని ప్రారంభించారన్నారు. ఆమె సేవలు, దేశ విదేశాల్లో గుర్తింపు పొందాయని ఆమె సంస్థ సేవలు దేశ విదేశాల్లో విస్తరించి విశ్వమానవ సేవలో మధర్ తరించారన్నారు.

# అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్

**మదనపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



మదనపల్లె రూరల్ మండలంలోని అంకిశెట్టిపల్లి చెరువు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సోమవారం రెవెన్యూ, అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని తెలుసుకొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించడంతో వారు మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం శ్రీనివాసులు మాట్లాడుతూ రూరల్ మండలాల్లో అక్రమంగా ఇసుక, మట్టి రోజూ తరలిస్తూ లక్షలాదిరుపాయలు దొచుకొంటున్నారన్నారు. రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా అక్రమంగా ఇసుక, మట్టిని రవాణా అవుతున్న వాహనాలపై దాడులు నిర్వహించి అరికట్టాలని కోరారు. సీజ్ చేసిన వాహనాలను తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిల్వ ఉంచిన ఇసుకను కూడా సీజ్ చేయాలని కోరారు.

# దాతల సాయంతో ఆర్‌ఓ ప్లాంట్

**మదనపల్లెక్రైం. ఆగస్టు 26 ప్రభాతవార్త :**

ప్రభుత్వాస్పత్రిలో దాతల సాయంతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు తెలిపారు. బెంగళూరుకు చెందిన ఎన్‌వి.రావ్ బ్రాండ్ వ్యవస్థాపకులు సంతోష్ కెటి, దర్శన్ ఎంటిలు రూ.3,25 లక్షలతో రెండు ఆర్ఓ ప్లాంట్‌లను వితరణగా అందజేశారు. ఆసుపత్రిలో వైద్యురాలుగా పని చేసిన సరస్వతమ్మ కోరిక మేరకు ఆర్ఓ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎంఓ మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం దాతలు స్పందించి ఆర్ఓ ప్లాంట్‌లను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. రోగుల కోసం రూ.3లక్షలతో ఒక ప్లాంట్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కోసం రూ.25 వేలతో ఒక ప్లాంట్‌ను వితరణగా ఇవ్వటం జరిగిందన్నారు. త్వరలోనే వీటిని ప్రారంభించటం జరుగుతుందన్నారు.

# గ్రామాభివృద్ధికి సహకరిస్తాం : సర్పంచ్

**కురబలకోట, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

కనసానివారిపల్లె గ్రామాభివృద్ధికి అధికార పార్టీ నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకొని అభివృద్ధికి సహకరిస్తామని కనసానివారిపల్లె సర్పంచ్ ఆర్‌కె.క్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైసిపి హాయాంలో మారుమూల గ్రామాల్లో సుమారు రూ.10కోట్ల వ్యయంతో సిసిరోడ్లు, మురికి కాలువలు గ్రామసచివాలయం, ఆర్‌బికే, వెల్‌నెస్‌సెంటర్ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కూటమి నాయకులు ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేస్తే తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు.

# రోడ్డుపక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ - ఆదమరిస్తే ప్రమాదం

**కురబలకోట, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



అంగళ్ళు-సిటిఎం రోడ్డులో సలీం కయ్యలమండీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపక్కనే ఉండడంతో ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఈ ట్రాన్స్ ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. ఈ మార్గాన తిరుపతి, కదిరి వెళ్ళే వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం అధికసంఖ్యలో ద్విచక్రవాహనాలు వెలుతున్నాయి. విద్యార్థులు ద్విచక్రవాహనాల్లో కళాశాలలకు వెలుతున్నారు. ఇండ్లకు సమీపాన ఉండడంతో చిన్నపిల్లలు సైతం సంచరిస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇనుపకంచె లేదు. దీంతో ఆ పరిసర ప్రాంత వాసులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇనుపకంచెను ఏర్పాటు చేసి ఎత్తులో ఉంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

**రామసముద్రం, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయితీలోని తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో పాడిఆవులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారి లారెన్స్ మాట్లాడుతూ పశువులకు జ్వరం, కాళ్ల వద్ద పుండ్లు రావడం మేత మేయకపోవడం లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కలిగిని పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలనో నాగభూషణం, చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, దామోదర్‌రెడ్డి, శివారెడ్డిబాబు, క్రిష్ణప్ప, వెంకటరమణ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిష్ణాష్టమి వేడుకలు

**రామసముద్రం, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



మండలంలో క్రిష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పిల్లలు కృష్ణుని వేషాధారణలతో పలువురిని అలరింపచేశారు. మండలంలోని ఉలపాడు పంచాయితీ దిన్నెపల్లెలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో క్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గ్రామస్థులు గ్రామపెద్దలు అన్నదానం నిర్వమించారు. పలుగ్రామాల్లో కుదురుచీమనపల్లె, బరిడేపల్లె ఎలావానెల్లూరు, బలసముద్రం గ్రామాల్లో క్రిష్ణాష్టవి వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కురబలకోటలో క్రిష్ణాష్టమి వేడుకలు

**కురబలకోట, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

కురబలకోట మండలంలో క్రిష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పిల్లలు శ్రీక్రిష్ణుని వేషదారణలతో అలరింపచేశారు. తెట్టులోని శ్రీ సంతాన వేణుగోపాల్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెట్టు సర్పంచ్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఆటో ఢీ కొని గాయపడ్డ కూలి మృతి

**మదనపల్లెక్రైం, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

ఆటో డీకొని గాయపడిన కడప వాసి మృతి చెందినట్లు రెండవ పట్టణ ఏఎస్ఐ రమణ తెలిపారు. కడప చిన్నచౌకకుచెందిన శివ(45) జీవనాధారం కోసం మదనపల్లె చంద్రకాలనీకి వచ్చి ఏడాదిగా భవన నిర్మాణం పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 22రాత్రి కూలిపనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా ఆటో ఢీ కొని శివ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రథమ చికిత్సల అనంతరం అతని ఆరోగ్యం మరింత విషమించడంతనో కుటుంబీకులు అతని తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అక్కడ సోమవారం శివ మృతి చెందాడు. ఘటనపై ఆటో డ్రైవర్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

# హెల్పింగ్‌మైండ్ సేవలకు జాతీయ అవార్డు

**మదనపల్లెక్రైం, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



మదర్ సర్వీస్ సొసైటి రెండవ వార్షికోత్సవంలో పురస్కరించుకొని సమాజసేవకు అంకితమైన వివిధ రంగాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ స్వతంత్ర్య సమరయోదులు మహనీయులు ఆంధ్రా, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, తమిళనాడు, ఐదు రాష్ట్రాల స్వచ్ఛందసేవనకులకు జాతీయ అవార్డులు ప్రధానం చేశారు. ఇందులో భాగంగానే హెల్పింగ్‌మైండ్స్ సేవలకు గానూ మదర్‌థేరిస్సా జాతీయ అవార్డును హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్‌కు శాలువకప్పి, ప్రసంశాపత్రంతో అవార్డు ప్రధానం చేసిన మదర్ సర్వీస్ సొసైటి సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాద్‌రావు, హ్యుమన్ రైట్స్ ఫౌండర్ బొడ్డుపాటి దాస్, సినీ నిర్మాత ముసాఅలీఖాన్ తదితరులు కలరు.

# ట్రావెల్స్ యజమానులకు డీఎస్పీ కౌన్సెలింగ్

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు ట్రావెల్స్ యజమానులకు సోమవారం డీఎస్పీ భక్తవత్సలం కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రావెల్స్ ద్వారా ప్రధాన నగరాల నుంచి ప్రొద్దుటూరుకు అక్రమంగా స్మగ్లింగ్ పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింతి. గత కొద్ది రోజులు కిందట విశాఖ నుంచి ప్రొద్దుటూరుకు అక్రమంగా ట్రావెల్స్ ద్వారానే గంజాయి తరలించడం జరిగింది. కావునా ట్రావెల్స్ యజమానులు అక్రమాలకు తావివ్వకుండా జాగ్రత్త వహించాలని డీఎస్పీ భక్తవత్సలం సూచించారు. రాత్రి సమయంలో ట్రావెల్స్ బస్సులు ట్రాఫిక్‌కు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రావెల్స్ యజమానులను హెచ్చరించారు.

# సేవా మానవతామూర్తి మదర్ థెరిసా

**కడప కార్పొరేషన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**



అభాగ్యుల జీవితాల్లో వెలుగు నింపిన మహోన్నతమైన వ్యక్తి మదర్ థెరిసా అని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా కొనియాడారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా సోమవారం కడపలోని తన కార్యాలయంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్‌థెరిసా తోటి వారికి సహాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్నే త్యాగం చేసిందన్నారు. 12వ ఏట సేవకు అంకితమై తన 18వ ఏట సిస్టర్స్ ఆఫ్ లోరేటో సంఘంలో చేరారన్నారు. మదర్ థెరిసా ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి, మానవ సేవకు శ్రీకారం చుట్టారన్నారు. అనాథల కోసం మోతిజిల్ అనే పాఠశాలను ఏర్పాటు చేసి వారి పోషణకు కలకత్తా వీధుల్లో జోలె పట్టి కడుపు నింపారన్నారని తెలిపారు. మదర్ థెరిసా చేసిన సేవలను గుర్తించి ఎంతో మంది సహాయంగా నిలిచారన్నారని చెప్పారు. మదర్ థెరిసా మిషనరీ చారిటీ ఏర్పాటు చేసి వృద్దులకు, అభాగ్యులకు, పేదలకు, రోగులకు సేవలు అందించారన్నారు. అనాథ శరణాలయాలు, ధర్మశాలలు, హెచ్ఐవీ, కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, తమిమ్, గౌస్‌పీర్, సుబ్బరాయుడు, బాబ్జీ, రమణమూర్తి పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ భగవానుడి పుట్టుక మహాద్భుతం

**రామాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**



శ్రీకృష్ణ భగవానుడి పుట్టుక మహాద్భుతమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రామాపురం మండలం బండపల్లె సమీపంలోని ప్రేమాలయంలోని శ్రీకృష్ణాలయంలో సోమవారం వైభవంగా జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన పుట్టుక మహా అద్భుతమని పుట్టుక విశేషాలు తెలిపారు. యుగయుగాలుగా శ్రీకృష్ణుడితత్వం, జీవితం మానవ జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి ప్రజలకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కీ.శే.చింతం వెంకటరెడ్డిచే ఏర్పాటైన ప్రేమాలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రెస్కో ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, గంగిరెడ్డి, రవిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణ యాదవ్, లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**రామాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**



మండలంలోసోమవారం కృష్ణాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన రామాపురంలోని హరిహరాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని దేవాలయ భక్తులతో శ్రీకృష్ణుని చిత్రపటంతో భారీ ఊరేగింపు నిర్వమించారు. హిందూ ధార్మిక సంఘాలు, విశ్వహిందూ పరిషత్ వ వారు బజరంగ్‌దల్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ర్యాలీని ఉద్దేశించి విశ్వహిందూ పరిషత్ అన్నమయ్య జిల్లా సహ సంయోజక్ వీరారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామాపురం మండలం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదర్ నాయుడు, మోహన్ నాయుడు, కదిరయ్య, మండలంలోని రాశిపల్లె గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మండలంలోని కొండపల్లి సమీపంలో ఉన్న ప్రేమాలయం వద్ద ఉన్న శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రేమాలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

# తంబళ్లపల్లెలో బీజేపీ సభ్యత్వం వేగవంతం చేయండి

**తంబళ్లపల్లె, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండలంలో సెప్టెంబరు 3వ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వం వేగవంతం చేయాలని మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ సీనియర్ నాయకుడు మగ్గాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర బీజేపీ సమాచార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి మాట్లాడారు. 36 పోలింగ్ బూతుల పరిధిలో కార్యకర్తలు 200 మించి సభ్యత్వం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ రామిగానిపల్లి శంకర్‌రెడ్డి, డీలర్ సుబ్బయ్య, బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రంగారెడ్డి, హరినాథ్‌రెడ్డి, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లెలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**తంబళ్లపల్లె, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండలంలో సోమవారం ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం మహిళలు శుచితో శ్రీకృష్ణ సత్యభామ చిత్ర పటాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయం, రామాలయం, కుక్కరాజుపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం కోసువారిపల్లి ప్రసన్న వెంకటేశ్వర ఆలయాలలో స్థానిక మహిళలు కృష్ణాష్టమి జరుపుకున్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

**ఓబులవారిపల్లె, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ఓబులవారిపల్లి మండలంలో అన్ని పంచాయతీల్లో శ్రీకృష్ణ దేవాలయాలు కిటకిటలాడాయి. శ్రీకృష్ణ జయంతి సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. వీరిని చూసేందుకు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ జయంతి వేడుకల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

# రాయచోటి రూరల్ సిఐని మర్యాద పూర్వకంగా కలసిన

**వీరబల్లి,ఆగష్టు26,ప్రభాతవవార్త :**



రాయచోటి రూరల్ సిఐ గా బాధ్యతలు స్వీకరించిన వరప్రసాద్‌ను తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కడప జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ముద్దలూరి భాస్కర్ రాజు సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమమంలో ఆయన వెంట తెలుగుదేశం నాయకులు అశోక్ గజపతి రాజు, బాయప్ప నాయక్, మని, వెంకటేశ్, శీను, అయ్యప్ప తదితరులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ పిల్లల చేత రోజుకో భగవద్గీత స్లోకం పఠించాలి

**పెనగలూరు,ఆగష్టు26,ప్రభాతవవార్త :**



భారత దేశంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ప్రతి రోజు భగవద్గీత శ్లోకాలు పఠించాలని శ్రీకృష్ణ భగవాన్ భక్తులు కోలా మురళి, అలిశెట్టి నవీన్ రాజ్‌లు తెలిపారు. సోమవారం వారు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రంలోని కృష్ణాలయంలో వారు విలేఖర్లతో మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన భగవద్గీత ఏ ఒక్క హిందూ మతానిది కాదని, ఇది ప్రపంచంలోని ప్రతి జీవికి వర్తిస్తుందని తెలిపారు. శ్రీకృష్ణుడు మన దేశంలో పుట్టడం మనం చేసుకున్న అదృష్టం అని తెలిపారు. మనం చూడలేదు అంటే మన కన్ను చూడలేక పోతున్నది అని అర్థం అన్నారు. శ్రీకృష్ణి దేవుడు అని ముద్ర వేసి మనిషికి నేలకి దూరం చేయద్దు బయలాజికల్‌గా భూమి మీద జన్మ ఎత్తాడు. ప్రపంచ దేశాలు అన్నీ మన గీత చదువుతుంటే మనం మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తమ పిల్లల చేత భగవద్గీత శ్లోకాలు చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమమంలో మీసాల నవీన్, మద్దెల పెంచలయ్య, జీరోపల్లి శివయ్య, తాటిబోయిన ధనయ్య తదితరులు పాల్గొన్నారు.

# హంతకులను కఠినంగా శిక్షించాలి

**వీరబల్లి, ఆగష్టు 26, ప్రభాతవవార్త :**

ఇటీవల భారతదేశంలోనే సంచలనం సృష్టించిన కలకత్తా జూనియర్ డాక్టర్ హత్య చాలా దారుణమని వీరబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆవేధన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజలకు ప్రాణాలు పోసే డాక్టర్‌కే రక్షణ లేకుండా పోతే ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇంత దారుణమైన సంఘటన జరిగి నేటికి 15 రోజులు గడుస్తున్నా ఇంకా దోషులను పట్టుకోలేక పోవడం చాలా బాధాకరం అన్నారు. జూనియర్ డాక్టర్‌ను అతి దారుణంగా హత్యాచారం చేసి కిరాతకంగా హతమార్చినా హంతకులను ఇంతవరకు పట్టుకోకపోవడం చాలా అనుమానాలకు తివిస్తున్నదని తెలిపారు. ఈ సంఘటనపై ప్రభాతవార్తతో వారు మాట్లాడారు. వారి ఆదేశన వారి మాటల్లోనే...

## ఉరిశిక్ష అయినా తక్కువే : మనీషా, డాక్టర్



జూనియర్ డాక్టర్ పై హత్యాచారం, హత్య కు పాల్పడిన వ్యక్తులకు వెంటనే ఉరిశిక్ష వేసి అలాగే వదిలివేయాలని తెలిపారు. శిక్షలు కఠినంగా అమలు జరిగితే ఇలాంటివి జరగవని తెలిపారు. హత్యాచారానికి గురై ఇన్ని రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి స్పంధన లేదన్నారు. ఇందులో పెద్ద వారి హస్తం ఉన్నట్లు యూట్యూబ్‌లలో వార్తలు చాలానే వస్తున్నప్పటికీ నిజా నిజాలు తెలుసుకుని ఇలాంటి సంఘటనలకు పాల్పడిన వారికి దేశం మొత్తం చూసే విధంగా ఉరి తీయాలని తెలిపారు. చట్టాలలో మార్పులు తీసుకురావాలన్నారు. ఎటువంటి వారు అయినా తప్పు చేస్తే, లేదా తప్పు చేయాలని ఆలోచన వస్తే శిక్షలు గుర్తుకు వచ్చి ఆగిపోయేవిధంగా న్యాయ వ్యవస్థ ఉండాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందని. ఇప్పటికైనా కఠినంగా శిక్షలు అమలు చేయాలి.

## ఎన్ని చట్టాలు వచ్చినా ప్రయోజనం లేదు : కల్పన



బాలికల కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా ప్రయోజనం లేదు. ఇటీవల కలకత్తాలో జరిగిన మెడికో హత్యాచారం, హత్య కు పాల్పడిన వ్యక్తుల పైన ప్రభుత్వం నుండి ఎటువంటి స్పంధన లేదు. తప్పు చేసిన వారిని ఉరిశిక్ష విధించాలి. ఇలాంటి సంఘటనలు దేశంలో ఎక్కడైనా జరగకుండా ఉండాలంటే తప్పు చేసిన వారికి వెంటనే ఉరిశిక్ష అమలు చేసే విధంగా చట్టాలు రావాలి.

## నడి రోడ్డు మీద ఉరి తీయాలి : లక్ష్మీశేఖర్ రెడ్డి, డాక్టర్



ఇంతటి ఘాతుకానికి పాల్పడిన వ్యక్తులు ఎవరైనా వెంటనే బహిరంగంగా ఉరి తీయాలి. శిక్షలు అంత కఠినంగా ఉంటేనే తప్పు చేయాలంటే భయం వేయాలి. అభం శుభం తెలియని ఒ జూనియర్ డాక్టర్ ను అంత కిరాతకంగా హత్యాచారం చేసి హత్య చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా శిక్షలు కఠినంగా అమలు చేయాలి.


## శిక్షలు కఠినంగా అమలు చేయాలి : రామ్మోన్ రెడ్డి, ఆర్‌యంపి డాక్టర్,



ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలి. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినాతి కఠినంగా శిక్షించే విధంగా న్యాయశాస్త్రంలో మార్పులు రావాలి. ఏ తప్పు చేసినా నాకేమిలే అనుకుంటున్న వారికి ఈ శిక్ష ఒ కనువిప్పు కావాలి. తప్పు చేయాలంటే వెన్నులో వణుకు పుట్టాలి. అలాంటి శిక్షలను వెంటనే అమలు చేయాలి.

# కన్నుల పండుగగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**వీరబల్లి, ఆగష్టు26, ప్రభాతవవార్త :**



మండల కేంద్రంలోని షిర్డీ సాయి మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు విరివిగా పాల్గొని విశేష పూజలు చేశారు. గోకుల కృష్ణునికి తనివితీరా గీతాలాపన చేసి తరించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మల్లేష్, తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమమంలో శ్రీనివాసులు, మధు సూధన రెడ్డి, ఎర్రిస్వామి, నాగమల్ రెడ్డి, విఆర్‌డియస్ సురేంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడు

**గాలివీడు, ఆగస్టు 26(ప్రభాతవార్త):**



గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తు చేసుకుని ముందుకు సాగడమేనని వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం గాలివీడు పట్టణం అరవీటి వాండ్లపల్లె దగ్గర వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీకృష్ణతత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చని వివరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాల వితరణ గావించారు.

# గోవర్ధనగిరిలో వైభవంగా శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు


**మదనపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్ గోవర్ధన్‌గిరి శ్రీక్రిష్ణ ఆలయంలో సోమవారం శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5గంటలకు అభిషేకాలు, 9గంటలకు కళ్యాణోత్సవం, 11గంటలకు సాంస్కృతికకార్యక్రమాలు, 3గంటలకు వసంతోత్సవం, స్వామివారి ఊరేగింపు జరిగింది. వేలాది మంది భక్తులు శ్రీక్రిష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, క్రిష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా గోవర్ధనగిరిలో శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మదనపల్లె డివిజన్‌లోని తంబళ్ళపల్లె, మదనపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో పాటు అన్నమయ్య జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి శ్రీక్రిష్ణ ఆలయంలో స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు క్రిష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీక్రిష్ణాష్టమి ఉత్సవం వైభవంగా జరిగింది.

# రూ.12కోట్లతో రోడ్ల అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే


**మదనపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రం ఆర్థికంగా దెబ్బ తిందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, కాలువల నిర్మాణానికి గానూ ప్రభుత్వం రూ.12కోట్లు మంజూరు చేసిందన్నారు. మున్సిపాలిటిలో కూడా రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో మున్సిపల్ జనరల్ నిధులు కూడా రాష్ట్ర ఖజానా ఖాతాలో జమ కావడం వల్ల మున్సిపాలిటిలో ఎటుచూసిన రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో 25గోకులం షెడ్లు మంజూరు అయ్యాయన్నారు. కోమిటివానిచెరువు ప్రత్యేకంగా అభివృద్ధి చేసి బోటింగ్ సిస్టం పెట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలోని పార్కుల అభివృద్ధి కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు సుమచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నాదేళ్ళ విద్యాసాగర్, నవీన్‌చౌదరి, సుధాకర్, ఎస్ఎ.మస్తాన్, జెసిబి మదు, పులి మహాలక్ష్మి, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

**మదనపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



రైతు సంక్షేమాన్ని విస్మరిస్తూ కార్పోరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను పూర్తిగా విస్మరించిందన్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో రైతాంగం పూర్తిగా దివాల తీసిందన్నారు. దేశంలో 100కు 60మంది ప్రజలు వ్యవసాయంలోనే జీవనం సాగిస్తున్నారన్నారు. 120కోట్ల మందికి ఆహార భద్రత వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు సహా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాలయసీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావడానికి పాలక ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. రైతాంగ సమస్యలపై ఉద్యమించాలన్నారు. సెప్టెంబర్1న రైతాంగ కోర్కెల దినోత్సవంను విజయవంతం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలతో పూర్తిగా నష్టపోతున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ నారుతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారన్నారు.

## జువారి సిమెంట్ కర్మాగారంలో కృష్ణాష్టమి వేడుకలు

యర్రగుంట్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త:




శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని జువారి కర్మాగారంలోని డిఏవి స్కూల్ నందు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలను బాగా అలరించాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి నాయుడు మాట్లాడుతూ ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు భరత నాట్యం నృత్యాలు, పాటల పోటీలు, ఉట్టి కొట్టడం లాంటి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. చిన్న పిల్లలు చిన్న కృష్ణుని వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు మరియు విధ్యార్థులు, తల్లి దండ్రులకు ప్రతి ఒక్కరికి ప్రిన్సిపాల్ వేణుగోపాల నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఘణంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:



స్థానిక కామనూరులోని ప్రసన్న వేణుగోపాల స్వామి గోశాలలో సోమవారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినటువంటి మాధవిలత, బ్రహ్మపదం, కృష్ణమాచార్య హాజరయ్యారు. ఈ సంధర్భంగా మాధవి లత మాట్లాడుతూ హిందూవులంతా ఒక చోట చేరి సాంప్రదాయంగా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. హిందూవులంతా సాంప్రదాయంతో మెలగాలని, చిన్నారులకు చిన్నప్పటి నుంచే మన సాంప్రదాయాలు విలువలు నేర్పించాలని, ప్రపంచంలోనే హిందూ సంప్రదాయం చాలా గొప్పదని హిందువులంతా ఏకతాటిపై నడిచి ప్రతి పండుగలను విజయవంతం చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చితీరాల నాగార్జున నావు, వివేకానంద సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ లక్ష్మినరసయ్య, మారెళ్ల మల్లికార్జున రావు, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు నాగమునిరెడ్డి, చిప్పగిరి ప్రసాద్, వంకధార వీరభద్రయ్య, కాల్వ చలపతి, మార్కండేయ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌గా కొవ్వూరు రమేష్ రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:

స్థానిక పెన్నానది తీరంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో శనివారం జరిగిన శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులుగా ఉన్న నామ రమేష్ బాబు ఆనారోగ్యం కారణంగా వారు అధ్యక్ష పదవికి రాజీనామా చేయగా, అందుకు గాను కమిటీ అందరూ సమిష్టి నిర్ణయంతో కొవ్వూరు రమేష్ రెడ్డిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీరాం వెంకట నారాయణ, కార్యదర్శి నటకల సతీష్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా బచ్చునంద కిశోర్, నిచ్చెనమెట్ల సుధీర్‌కుమార్, కోశాధికారిగా టంగుటూరు వినోద్‌కుమార్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటి కాలపరిమితి 3సంవత్సరములు ఉంటుందని తెలిపారు.

## అవినీతిని ఎప్పటికి ప్రోత్సహించదు ఎమ్మెల్యే వరద కుటుంబం

### మాజీ సర్పంచ్ శివనాగిరెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:




ప్రొద్దుటూరు నియోజకవర్గ చరిత్రలో ఎప్పటికీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కుటుంబం అవినీతిని, అక్రమాలను ప్రోత్సహించదని మాజీ సర్పంచ్ శివనాగిరెడ్డి అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి వారి కుటుంబ సభ్యులపై మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారు రెడ్డి చేసిన విమర్శలను ఆయన ఖండించారు. టిడిపి నాయకులు టిప్పర్లతో ఇసుక, మట్టిని తరలిస్తున్నారని బంగారు రెడ్డి, ఎమ్మెల్యే వరద కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం తగదు అన్నారు. కామనూరు గ్రామం అభివృద్ధి కొరకు గ్రామ కమిటీలకు సంబంధించి గ్రామం తరపున తాము మట్టిని తోలుకుంటున్నట్లు, ఈ మట్టి ద్వారా గ్రామంలోని పార్క్ అలాగే రోడ్లలోని గుంతలు పూడ్చడానికి ఉపయోగించినట్లు ఆయన తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామ కమిటి నిర్ణయం మేరకే తాము మట్టిని ఉపయోగించుకున్నట్లు, అయితే వైసిపి నాయకులు టిప్పర్లపై గల ఎన్వీఆర్ఆర్ అనే పేరును వక్రీకరించి శాసనసభ్యులు వరదపై బురదజల్లే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టిప్పర్లపై ఉన్న ఎమ్.వి.ఆర్.ఆర్ అనగా నిమ్మకాయల వెంకట రమణారెడ్డి అని, అతని పేరుమీదనే టిప్పర్లు ఉన్నట్లు స్పష్టం చేస్తూ, వైసిపి హయాంలో స్వారాజ్యంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి అక్రమార్జనకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏనాడు ఎమ్మెల్యే వరద, ఆయన కుటుంబ సభ్యులు అవినీతిని ప్రోత్సహించలేదని, ఇకనైనా వైసీపీ నాయకులు నిజా నిజాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలని హితవు పలికారు.

## వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధలకు అన్నదానం

ప్రొద్దుటూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:




అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సభులు అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామానికి చెందిన సుబ్బిగారి చంద్రశేఖర్ తండ్రి సుబ్బిగారి వెంకటయ్య 5వ వర్ధంతి సంధర్భంగా పట్టణంలోని యానాది కాలనీలో నివసించే కాంతమ్మ అనే నిరుపేద మహిళకు 2 నెలలు నిత్యావసర సరుకులు, మాతృదేవోభవ అనాధ ఆశ్రమంలో 130మంది అనాధలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మిదేవి, పామిడి వీరయ్య యాదవ్, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త:



స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా బలరామ కృష్ణుల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా పెద్దఎత్తున పాల్గొన్న భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా దాదాపు 30,000 మందికి అన్నదానం నిర్వహించారు.

## 30న వినాయక వార్షికోత్సవ వేడుకలు

దువ్వూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో కేసీకెనాల్ సమీపాన వెలసి ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి మందిరం నందు ఈ ఈ నెల 30వ తేది శుక్రవారం 19వ వార్శికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ మహాగణపతి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి, శ్రీ షిర్డిసాయి బాబా వారి పంచామృతాభిషేకం, తీర్థప్రసాదాలు అలాగే హోమం, మహాపూర్ణహారతి, మంగళహారతి తదితర పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే సాయంత్రం 5గంటలకు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే భక్తులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగింపు

దువ్వూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:



స్థానిక తెలుగంగ బంగ్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం విద్యుత్ సంస్థ నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ విద్యుత్ మీటర్లను తొలిసారిగా ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటుచేసినట్లు ఈఈ భరణీ కృష్ణ తెలిపారు. తెలుగుగంగా బంగ్లాలోని ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్, గ్రామ సచివాలయం, సహకార సంఘ కార్యాలయాలకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ క్షనివాసుల రెడ్డి, ఏఈ వీరారెడ్డి, ఆదాని సంస్థ ప్రతినిధి సురేంద్ర, విద్యుత్ సిబ్బంది శేశయ్య, నాయబ్‌రసూల్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వైభవంగా జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కడప వైద్యవిభాగం, ఆగస్టు 26, ప్రభాతవార్త:



నగరంలోని ఊటుకూరు దగ్గర గల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ మేనేజర్ శంకర్ మాట్లాడుతూ ఉదయం విశ్వక్సేన పూజ, ఆరాధన, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమంలు జరిగాయన్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు డా.నాగన్న ధర్మపత్ని శ్రీమతి కీ.శే.లక్ష్మిదేవమ్మల కుమారుడు డా.ఉపేంద్రకుమార్ ధర్మపత్ని శ్రీమతి డా.జ్యోతినీరజల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నిర్వహించింది. కల్యాణ మహోత్సవం చేయించు భక్తులకు వస్త్రతాంబూలాలు అందజేశారు.

## ఆవులు, పందుల యజమానులను హెచ్చరించిన మున్సిపల్ కమిషనర్

బద్వేలు, ఆగస్టు 26 (ప్రభాతవార్త):

పట్టణంలో ప్రధాన రహదారుల వెంట పందులు మరియు ఆవుల సంచారాన్ని నిషేదించినట్లు, ఇందుకు సంబంధించి వాటి యజమానులు వాటిని తమ ఆవరణలోనే ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 10వ తేది వరకు ఇందుకు సమయం కేటాయిస్తున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయంలోగా ఆవులను మరియు పందులను తగు ప్రదేశాలు ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంతాలలో సంరక్షించుకోవాలని సెప్టెంబరు 10వ తేదిపైన పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఎక్కడ కనిపించిని మున్సిపాలిటీ సిబ్బంది వాటిని అదుపులోకి తీసుకుని దూరంగా అడవులలో వదిలేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వాటి యజమానులు ఈ అంశంపై దృష్టిసారించాల్సి ఉందన్నారు.

## ఒకటవ తేదినే పెన్షన్లు అందజేయాలి

బద్వేలు అర్బన్ , ఆగస్టు 26 (ప్రభాతవార్త):

రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదిన ప్రభుత్వం పెన్షన్లు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉత్యోగుల సంఘం బద్వేలు శాఖ అధ్యక్షులు శీలం గంగన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో 7వ తేది వరకు పెన్షన్ దారుకు వారి బ్యాంక్ ఖాతాలో జమచేయడం జరిగిందని ఈసారి అలా కాకుండా 1వ తేదినే పెన్షన్లు వారి ఖాతాలలో జమ చేయాలని కోరారు. పెన్షన్ దారులలో చాలామంది వారి పిల్లల వద్ద కాకుండా స్వతంత్రంగా జీవితాస్తున్నారని, వారి మందులు, ఇంటి అద్దె కట్టేందుకు తదితర అవసరాలకు డబ్బులు వెంటనే చెల్లించాల్సిన పరిస్థితి ఉంది కావున ప్రతి నెల ఒకటవ తేదిన వారి ఖాతాలలో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

## మానవతామూర్తి మదర్‌థెరిస్సా

వేంపల్లె, ఆగస్టు 26, ప్రభాతవార్త ః



మానవసేవే మాధవసేవగా భావించిన మహోన్నత మానవతామూర్తి మదర్‌థెరిస్సా అని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ ఎన్. తులసిరెడ్డి కొనియాడారు. సోఐమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సేవచేసే చేతులు మిన్న అని మదర్‌థెరిస్సా నిరూపించారన్నారు. కుష్ఠురోగులకు, భిక్షాటన చేసేవారికి, దేశతిమ్మర్లకు, అనాథ శిశువులకు ఆశ్రయం కల్పించాలని ఆయన అన్నారు. ఆమె అందరికీ ఆదర్శప్రాయురాలు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, బాబు, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్, రాజా, మదార్, వేమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లె నారాయణ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వేంపల్లె, ఆగస్టు 26, ప్రభాతవార్త ః



వేంపల్లెలోని గండిరోడ్డులో ఉన్న నారాయణ జూనియర్ కళాశాల, పాఠశాలలో సోమవారం ఆ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. వీరిని కరస్పాండెంట్ ప్రత్యేకంగా అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేంపల్లెలో ప్రారంభమైన ఎగ్జిబిషన్

వేంపల్లె, ఆగస్టు 26, ప్రభాతవార్త ః



వేంపల్లె గ్రామ పంచాయతీలోని పులివెందుల రోడ్డులోని నలంద పాఠశాల సమీపంలో కెజిఎన్ ఎగ్జిబిషన్‌ను ఇటీవల ప్రారంభించారు. ఇక్కడ చిన్నపిల్లల నుండి పెద్దల వరకు ఊయలలు, రంగులరాట్నం, పడవ, రైలు, పలు రకాల పక్షులను పోలిన నమూనాలను ప్రదర్శిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండి ప్రజలు ఇక్కడకు వచ్చి ఆహ్లాదం పొందుతున్నారు.

## కెఎస్ఆర్ఎం కళాశాలలో ఎఐసిటిఇ-ఎటిఎఎల్ సంయుక్త ఎఫ్‌డిపి

కడప, ఆగస్టు 26, ప్రభాతవార్త:




కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల నందు ఎఐసిటిఇ-ఎటిఎఎల్ సంయుక్త ఎఫ్‌డిపి స్పాన్సర్డ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అడ్వాన్స్ ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ అండ్ ఎడగోజి (బోధనాశాస్త్ర) పద్ధతులను ఉపయోగించి ఫ్యాకల్టీ అడ్వాన్స్ సైంటిఫిక్ రీసెర్చ్ మెథడ్స్ అండ్ టీచింగ్ లెర్నింగ్ మెథడ్స్ ద్వారా విద్యార్థులు అందరికీ ఉన్నత విద్యా విధానాలను అమలు చేయవచ్చని తిరుపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి.శంకర్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎం.వి.శంకర్ మాట్లాడుతూ పెడగొలజీస్ మరియు ఎస్టైనబుల్ డెవలప్‌మెంట్ గురించి వివరణ ఇచ్చారు. కళాశాల వైస్ చైర్మన్ కందుల మదుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట నారాయణ, ఈఈఈ విభాగాదిపతి డాక్టర్ ఎంఎస్ ప్రియదర్శిని, ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.మారిప్రసాద్ డాక్టర్ కుమార్‌రెడ్డి, ఈఈఈ డిపార్ట్‌మెంట్ వివిధ కాలేజీల ఫ్యాకల్టీ, కెఎస్ఆర్ఆర్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుకరీచ్‌ను ప్రారంభించిన ఆర్డీవో

కొండాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త ః






కొండాపురం మండలంలోని ఏటూరు రీచ్‌ను సోమవారం జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు, కూటమి మండల నాయకుడు శివనారాయణరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇసుక పంపిణీకి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద వాహనాలు ఎలాంటి క్యూ లేకుండా ఎప్పటికప్పుడు ఇసుక లోడ్ చేసి పంపించాలని తెలిపారు. ఏరోజు ఇసుక కావాలని ఆర్డర్స్ బుక్ అవుతాయో, అదే రోజు లోడ్స్ డిస్ప్యాచ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మాధవ కృష్ణారెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, డిప్యూటి తహసీల్దారు రాజరాజేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు ఆనంద్‌రావు, తాళ్లప్రొద్దుటూరు సబ్ ఇన్‌స్పెక్టరు హృషికేశవరెడ్డి, మండల నాయకులు రెండెద్దుల రామాంజనేయులరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, అంకిరెడ్డి, రామసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పులివెందుల, ఆగస్టు 26, ప్రభాతవార్త ః



పులివెందులలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి శ్రీకృష్ణాలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. సాయంత్రం రాజస్థాన్ మహిళలచే దాండియా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివేకానంద స్కూల్ చిన్నారులచే నృత్య ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. మంగళవారం ఉదయం 10.00 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 3.00గంటల నుండి ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

## వైసీపీ నాయకులను పరామర్శించిన శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి, ఆగస్టు 26, ప్రభాతవార్త:



రాయచోటి పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని సోమవారం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా తండ్రి ఇలియాస్ బాషాను గుండె సంబందిత సమస్యకు స్టంట్ వేయించుకొని వాల్మీకి స్ట్రీట్‌లో ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొలిమి హరూన్‌బాషా, వైసీపీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, ఖలీల్, ఏకే తదితరులు పాల్గొన్నారు.


## ఏకీకృత పెన్షన్ పథకం అమోదయోగ్యం కాదు



బద్వేలు అర్బన్, ఆగష్టు 26 ప్రభాతవార్త :

కేంద్రప్రభుత్వం పక్రటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) ఆమోదయోగయం కాదని దానిని అంగీకరించేది లేదని జిల్లా యూటిఎఫ్ అధ్యక్షులు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్ పేరుగా మార్చిందన్నారు. సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలి పెన్షన్ ఇస్తామని యూపీఎస్ విధానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఉద్యోగుల, కాంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయం ప్రస్తావించకపోవడం దారుణమాన్నరు. యూపీఎస్ అనేది కేవలం ఆంధ్రప్రదశ్ అష్యూర్డ్ పెన్షన్ స్కీమ్ కాపీ అని ఎద్దేవా చేశారు. ఉద్యోగులలో వ్యతిరేకత మరియు భవిష్యత్తులో రాజకీయ పరిణామాలను పరిగణనలోకి తీసుకుని కనీస ఉపశమనం అందించడానికి కేంద్ర ప్రభుత్వ ఎతుత్గడ మోసపూరిత వ్యూహంగా ఈ ఏకీకృత పెన్షన్ విధానం ప్రవేశపెట్టిందన్నారు. పాత పెన్షన్ అమలులోకోసం ఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రుద్ద చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, గోపవరం మండల అద్యక్షులు క్రిష్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వార్త



రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

| అన్నమయ్య జిల్లా | కడప జిల్లా |
| --- | --- |
| సుండుపల్లె, వాయల్పాడు, కలకడ, మొలకలచెరువు | ఒంటిమిట్ట, కమలాపురం, చెన్నూరు, గోపవరం, యర్రగుంట్ల, అట్లూరు, సిద్దవటం, బద్వేలు రూరల్, కలసపాడు |

మీ పూర్తి బయోడేటాతో 31వ తేది శనివారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086